

ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో జరిగిన రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలు

# బీఆర్‌ఎస్‌కే భద్రాద్రి రామయ్య ఆశీస్సులు

## మా కుటుంబాన్ని మించిన రామభక్తులెవరు?

- నా పేరులోనే రాముడున్నాడు
- యాదాద్రి తరహా భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి
- భద్రాచల వరద ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం కల్పిస్తాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు హామీ
- ప్రగతి కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని మంత్రి కేటీఆర్ పిలుపు
- భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెంలో రోడ్‌షో

ఖమ్మం, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భద్రాద్రి రామయ్య దివ్యాశీస్సులు బీఆర్‌ఎస్‌పైనే ఉన్నాయని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. తమ కుటుంబం కంటే గొప్ప రామభక్తులు రాష్ట్రంలో ఎవరూ లేరని, తన పేరులోనే రాముడు ఉన్నాడని చెప్పారు. భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెం అభ్యర్థులు తెల్లం వెంకట్రావు, బానోత్ హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ ఆదివారం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోలో కేటీఆర్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. భద్రాచలంపై సీఎం కేసీఆర్‌కు అపారమైన ప్రేమ, సీతారాములపై భక్తి ఉన్నదని స్పష్టంచేశారు. ఈ కారణంతోనే కొత్తగూడెం జిల్లాకు భద్రాద్రిగా నామకరణం చేశారని గుర్తుచేశారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి రాగానే యాదాద్రి తరహాలో భద్రాద్రి ఆలయాన్ని సకల హంగులతో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. భద్రాచలవాసులకు గోదావరి వరద ముప్పు తప్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన కరకట్ట నిర్మిస్తామని తెలిపారు. కొత్తగూడేనికి విమానాశ్రయాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తుంటే కేంద్రంలోని మోదీ సర్కార్ అడ్డుపుల్ల వేసిందని ఆరోపించారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవకపోయినా అభివృద్ధి విషయంలో రాజీ పడలేదని చెప్పారు. మరింత అభివృద్ధి జరగాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

> తెలంగాణకు ఉన్న ఒకే ఒక్క గొంతుక సీఎం కేసీఆర్. ఆయన సారథ్యంలోనే తెలంగాణ సిద్ధించింది. ఆయన పాలనలోనే అద్భుత ప్రగతి సాధించింది. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌కు 11 సార్లు అవకాశం ఇస్తే ప్రజలకు ఏమీ చేయలేకపోయింది. ఇప్పుడు మళ్లీ ఏమరపాటుగా ఆ పార్టీకి అవకాశం ఇస్తే పంటికి అంటకుండానే మనల్ని మింగుతుంది. ఎన్నికల వేల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. -మంత్రి కేటీఆర్

### కాంగ్రెస్ 24 గంటల కరెంటు ఎందుకివ్వలేదు

రాష్ట్రాన్ని 55 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్.. తమ పాలనలో 24 గంటల కరెంట్, తాగునీరు, సాగునీరు ఎందుకు ఇవ్వలేదని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకాలను ఎందుకు అమలు చేయలేదని, పోడు పట్టాలు, సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్ ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్కాములు చేయడం, రాష్ట్రాన్ని మింగడమే కాంగ్రెస్ విధానమని దుయ్యబట్టారు. తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ.. రాహుల్‌గాంధీకి, నరేంద్రమోదీకి ఇసుమంతైనా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సింగరేణిని ప్రైవేటుపరం చేస్తామని ప్రధాని మోదీ అంటుంటే రాహుల్‌గాంధీ ఎందుకు మట్లాడలేదని నిలదీశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయకుండా మోదీ కాలయాపన చేసినా కాంగ్రెస్ ఎందుకు మాట్లాడటంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబర్ 3 తర్వాత గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీనే అని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మ్యానిఫెస్టోను అమలు చేస్తామని అన్నారు. అశ్వారావుపేట ప్రాంతంలో ఆయిల్‌పాం సాగు విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయిల్‌పాం రైతులకు అవసరానికి అనుగుణంగా కొత్త ఫ్యాక్టరీలు నిర్మిస్తామని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, ఖమ్మం, భద్రాద్రి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, రేగా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

#### 16 వేల మందికి పోడు పట్టాలు

భద్రాచలం నియోజకవర్గంలో 16 వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కేటీఆర్ తెలిపారు. గిరిజనేతరులకూ పోడు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, అందుకు బీజేపీ ప్రభుత్వం మోకాలడ్డుతుందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎన్నికల్లో ఓడించి సాగనంపితేనే గిరిజనేతరులకు పోడు పట్టాల పంపిణీ సాధ్యమవుతుందని చెప్పారు. సీతమ్మసాగర్ పనులు సాగకపోవడానికి కారణం, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కాంగ్రెస్ నేతలే కారణమని ధ్వజమెత్తారు. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్.. ప్రజల బతుకులను మార్చలేదని నిప్పులు చెరిగారు. ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మితే మోసపోవడం ఖాయమని హెచ్చరించారు. ఇప్పటికే కాంగ్రెసోళ్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డబ్బు సంచులతో తిరుగుతున్నారని, వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

> కేంద్రంలోని బీజేపీ సింగరేణిని మింగేయాలని చూస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంస్థను కాపాడుకుంటున్నది. తెలంగాణ వచ్చిన తర్వాతే కార్మికులకు లాభాల్లో వాటా, దసరా, దీపావళి బోనస్ పెరిగింది. సింగరేణి బతకాలంటే బీఆర్‌ఎస్ గెలవాలి. కార్మికులు ఉద్యమస్ఫూర్తిని చాటి గులాబీ జెండాఎగురవేయాలి. -మంత్రి కేటీఆర్



నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం కుప్కల్‌లో అభివాదం చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

# కాంగ్రెస్‌కు ఓటేస్తే ఢిల్లీకి తాకట్టు

### బీజేపీకి వేస్తే గుజరాత్‌కు.. ప్రచారంలో మంత్రి వేముల ఫైర్

భీమ్‌గల్, నవంబర్ 19 : కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణను ఢిల్లీకి, బీజేపీకి అధికారమిస్తే గుజరాత్‌కు అప్పగిస్తారని రోడ్లు భవనాల శాఖ మంత్రి, బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి మాట్లాడుతూ.. మళ్లీ పాత రోజులు తెచ్చేందుకు కొన్ని పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే తానే సీఎం అని చెప్పుకుంటున్న కిషన్‌రెడ్డి నాడు తెలంగాణ ఉద్యమం కోసం రాజీనామా చేయమంటే పారిపోయాడని ఎద్దేవా చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం తినలేదన్న పవన్ కల్యాణ్.. బీజేపీ సహకారంతో తెలంగాణలో అడుగు పెట్టిండని విమర్శించారు. తెలంగాణ పచ్చగా మారి ఇక్కడి ప్రజలంతా బాగు పడుతున్న సందర్భాన్ని కొన్ని శక్తులు చూడలేకపోతున్నాయని మండిపడ్డారు. వరి సాగులో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉన్నదని అన్నారు. తెలంగాణ కేసీఆర్ చేతుల్లోనే పదిలంగా ఉంటుందని, మరింత అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని వేముల కోరారు.



ఖమ్మం రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

# ఐదుతరాలకు ఉపయోగపడే అభివృద్ధి చేశా

- ఎన్ని నిధులు తెచ్చానో ప్రజలకు తెలుసు
- ఎక్కడ అభివృద్ధి చేశాడో తుమ్మలే చెప్పాలి
- ఖమ్మం రోడ్ షోలో మంత్రి పువ్వాడ

ఖమ్మం, నవంబర్ 19 : ఐదేండ్లలో రాజకీయాలకతీతంగా ఐదుతరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేశానని రవాణా శాఖ మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కమార్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఆదివారం ఖమ్మం నగరంలో మంత్రి రోడ్ షో నిర్వహించారు. మహిళలు హారతులు ఇచ్చి.. విజయ తిలకందిద్ది ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను మంత్రిగా కష్టపడి ఖమ్మంలో చేసిన అభివృద్ధిని.. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తాను చేసినట్టుగా ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. పెద్ద మనిషి అయి ఉండి అబద్ధాలు మాట్లాడుతున్నాడని అన్నారు. మందికి పుట్టిన బిడ్డను తన బిడ్డ అని ముద్దాడుతున్నట్టుగా ఆయన తీరు ఉన్నదని మండిపడ్డారు. ఇక్కడ జరిగిన అభివృద్ధికి ఎవరు కారణం? ఎవరు ఎన్ని నిధులు తెచ్చారు? అనే విషయాలు ప్రజలకు తెలుసని అన్నారు. సీఎం కేసీఆర్ నిధులు ఇస్తే.. ప్రతి పని దగ్గరుండి చేయించినట్టు చెప్పారు. తాను చేసిన అభివృద్ధితో ఖమ్మం ప్రాంతవాసుల ఆస్తుల విలువ గణనీయంగా పెరిగిందని, అంటే.. ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్టే కదా? అని అన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి వల్లే ఖమ్మం కీర్తి ప్రతిష్ఠలు పెరిగినట్టు చెప్పారు. అవకాశవాద రాజకీయాలు చేసే వారిని నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో

- మహిళలే ఎజెండాను రూపొందించాలి
- వచ్చే ఐదేండ్లలో దాని అమలుకు కృషి
- మహిళల సమస్యలకు టోల్‌ఫ్రీ నంబర్
- నా భార్య ధైర్యవంతురాలు, చెల్లి ఫైటర్
- మేమూ డీప్‌ఫేక్ బాధితులమే
- నల్సార్ సాయంతో ప్రత్యేక చట్టం తెస్తాం
- 'ఉమెన్ ఆస్క్ కేటీఆర్'లో మంత్రి కేటీఆర్




ఆదివారం 'ఉమెన్ ఆస్క్ కేటీఆర్' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): మహిళల కోసం ఓ సమగ్ర మ్యానిఫెస్టోను రూపొందించి, వచ్చే ఐదేండ్లలో దానిని అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. మహిళలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు త్వరలో ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటుచేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో ఆదివారం 'ఉమెన్ ఆస్క్ కేటీఆర్' పేరుతో మహిళలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యాక డిసెంబర్ 15 లోపు ఒక రోజు సమావేశమవుదామని, మహిళలే తమ ఎజెండాను రూపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మహిళల విద్య, వైద్యం, సంక్షేమం తదితర అంశాల్లో ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించడంతోపాటు వారితో వివిధ అంశాలపై ముచ్చటించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని, తాము మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల కోసం ప్రత్యేక ఎజెండాను అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే మహిళా యూనివర్సిటీని ఏర్పాటుచేసుకున్నామని, మెట్రో స్టేషన్ల నుంచి పరిసర ప్రాంతాలకు మహిళలను ఉచితంగా చేర్చే విధంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళలు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ఎన్నికల్లో మహిళలకు సరైన సంఖ్యలో టికెట్లు ఇవ్వలేదని, ఇది బాధాకరమని పేర్కొన్నారు.

### నాపై అమ్మ ప్రభావమే ఎక్కువ

'నాపై మా అమ్మ ప్రభావమే ఎక్కువ. అమ్మకి చిన్నతనంలోనే పెళ్లైంది. మా నాన్నవాళ్లకు తొమ్మిది మంది అక్కాచెల్లెళ్లు. చాలా పెద్ద కుటుంబం. నాన్న రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ మా అమ్మ అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ మాకు ఏ లోటూ రాకుండా చూసుకుంది. అమ్మను చూసి చాలా నేర్చుకున్నా. నా భార్యకు ఓపిక ఎక్కువ, ధైర్యవంతురాలు. మా చెల్లి ఫైటర్, డైనమిక్. అందరికంటే ఎగ్రెసివ్. మా పాపకు 14 సంవత్సరాలే అయినా చాలా ఆలోచిస్తుంది. మంచి రైటర్, క్రియేటివ్. కూతురు పుట్టాకే నా జీవితం చాలా మారింది. హైదరాబాద్ నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ఎక్కువ మంది మహిళలే. కొవిడ్ సమయంలో సుచిత్ర ఎల్లా, మహిమా దాట్ల వంటివారు గొప్పగా నిలిచారు. మహిళలు మానసికంగా చాలా బలంగా వుంటారు. 2014 ఎన్నికల సందర్భంగా సిరిసిల్లలోని గజసింగవరం అనే గ్రామ ప్రజలు నన్ను ప్రచారానికి రానివ్వలేదు. నేను వెనక్కు వెళ్తుంటే అదే ఊరుకి చెందిన సంపూర్ణ అనే ఓ అమ్మాయి తనను బలవంతంగా వారి ఊళ్లోకి ప్రచారానికి తీసుకొని వెళ్లింది. ఇచా చెప్పుకుంటూ పోతే చాలా మంది శక్తిమంతమైన మహిళలు ఉన్నారు' అని కేటీఆర్ వివరించారు.

### బాలికల విక్రయాలు, పాతబస్తీలో బాల్య వివాహాలు నిర్మూలించాం

2014కు ముందు దేవరకొండలో బాలికల విక్రయాలు, పాతబస్తీలో వృద్ధ అరబ్‌షేక్‌లతో వివాహాలు వంటి వార్తలు తరచూ వినిపించేవని, అలాగే, ఫ్లోరోసిస్‌కు సంబంధించిన సమస్యలు అధికంగా ఉండేవని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ఏర్పాటు తరువాత మహిళా రెసిడెన్షియల్ కాలేజీల ఏర్పాటు, ఇంటింటికీ తాగునీటి సరఫరావల్ల ఇవి చాలావరకు తగ్గిపోయాయని అన్నారు. ఒక్కో విద్యార్థినిపై రూ.10 వేల వరకూ ఖర్చుచేస్తున్నామని, దీంతో అమ్మాయిలు చదువుల్లో రాణిస్తున్నారని చెప్పారు. అమ్మఒడి, కేసీఆర్ కిట్ వంటి పథకాలతో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు 61% పెరిగాయని, శిశుమరణాలు తగ్గిపోయాయని చెప్పారు. స్త్రీనిధి పథకంతో వడ్డీలేని రుణాలు ఇస్తుండటంతో మహిళా సంఘాల సభ్యులు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఎదుగుతున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నెగెటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న మహిళల కోసం ప్రత్యేక వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. కోహెడ, నందిగాం, సుల్తాన్‌పూర్‌తోపాటు మరో ప్రాంతంలో మహిళల కోసం ప్రత్యేకంగా నాలుగు ఇండస్ట్రియల్ పార్క్‌లను నెలకొల్పామని తెలిపారు. జనరల్ ఇండస్ట్రియల్ పార్క్‌లలో కూడా 10 శాతం మహిళలకు కేటాయిస్తున్నామని చెప్పారు. మహిళలకోసం వీహబ్‌ను ఏర్పాటుచేశామని చెప్పారు. హైదరాబాద్‌లో గాంధీ, ఉస్మానియా దవాఖానల తరహాలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ దవాఖానలను నిర్మిస్తున్నామని, ప్రతి డివిజన్‌లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

### సైబర్ క్రైమ్‌లపై ప్రత్యేక చట్టం

మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నదని, వారికోసం భరోసా సెంటర్లు, షీటీమ్స్‌ను ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. తాము కూడా డీప్‌ఫేక్ బాధితులమేనని, విపక్షాలు తమను ఇబ్బంది పెట్టేందుకు ఈ తరహా చర్యలకు దిగుతున్నాయని ఆరోపించారు. సోషల్ మీడియాలో ఎవరిని పడితే వాళ్లను దూషించడం, ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ఎక్కువైపోయిందని చెప్పారు. ఇటువంటివాటికి చెక్ పెట్టేందుకు నల్సార్ యూనివర్సిటీ సహకారంతో ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ చట్టం తేవాలని నిర్ణయించామని తెలిపారు. ఈ చట్టంతో భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలుగుతుందనే విమర్శలు వచ్చే అవకాశముందని, అయితే తాము ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా ఓ టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదుదారు తమ పేరు, చిరునామా చెప్పకుండానే ఫిర్యాదు నమోదు చేసే విధంగా తగిన వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. మహిళలు ఎదుర్కొంటున్న ఎటువంటి ఇబ్బందినైనా ఈ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదుచేయవచ్చుని, ఫిర్యాదు ఏ శాఖకు సంబంధించినదైతే ఆ శాఖకు బదిలీచేసి పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.



హైదరాబాద్‌లోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో నిర్వహించిన 'ఉమెన్ ఆస్క్ కేటీఆర్' ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన మహిళలు

## కాంగ్రెస్‌కు ఓటేస్తే మాదిగ హక్కులకు విఘాతం

- హస్తం పార్టీకి మద్దతివ్వడం సరికాదు
- మోత్కుపల్లిపై టీఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి ఫైర్



ఆలేరు, నవంబర్ 19 : కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చెప్పడం ద్వారా మాదిగలను మరో పదేండ్లు వెనక్కి నెట్టడమే అవుతుందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. కాంగ్రెస్‌కు మద్దతుగా మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మాదిగ బిడ్డలైన సురేందర్, దామోదర్, మహేశ్‌ను పొట్టన పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని మోత్కుపల్లి సూచించడం సరికాదని అన్నారు. ఆదివారం ఆయన ఆలేరులో మీడియాతో మాట్లాడారు. మాదిగ జాతికి న్యాయం చేసిన బీఆర్‌ఎస్‌ను వీడి బయటికి రావడమే ఆయన చేసిన పెద్ద తప్పని, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్‌కు ఓటేయాలని చెప్పి ఇంకో తప్పు చేయవద్దని హితవు పలికారు. నాడు దళితబంధు పథకం పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం మీటింగ్ పెడితే దానికి వెళ్లిన మోత్కుపల్లి సీఎం కేసీఆర్‌ను అభినవ అంబేద్కర్ అని కొనియాడిన విషయాన్ని మర్చిపోయారా? అని ప్రశ్నించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, వేణుగోపాల్, రాహుల్ గాంధీ దగ్గర ఉండే కొప్పుల రాజు అంతా మాలలేనని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ జరుగుతుందా? అని ఆయన ప్రశ్నించారు. దళిత బంధు సమన్వయకర్తగా మోత్కుపల్లి ఉన్నప్పుడు సీఎం కేసీఆర్ గుండె ధైర్యం గొప్పదని మెచ్చుకున్న ఆయన ఇప్పుడు అహంకారి అని మాట్లాడటం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. బీఆర్‌ఎస్‌లో మోత్కుపల్లికి టికెట్ ఇస్తే ఇలా అనే వారా? అని ప్రశ్నించారు. అఖిల పక్షాన్ని ఢిల్లీకి పంపిన బీఆర్‌ఎస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 16.2°c | 35.5°c |
| ఆదిలాబాద్ | 16.8°c | 36.0°c |
| మెదక్ | 17.4°c | 34.7°c |
| నిజామాబాద్ | 18.1°c | 32.3 °c |
| నల్లగొండ | 19.4°c | 33.8°c |
| కరీంనగర్ | 20.0°c | 32.0°c |
| వరంగల్ | 21.0°c | 32.0°c |
| హైదరాబాద్ | 21.5°c | 30.6°c |
| ఖమ్మం | 22.0°c | 34.0°c |
| మహబూబ్‌నగర్ | 22.8°c | 31.5°c |

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### ఎన్ఐవీలో...

**ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 80
- పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్, టెక్నీషియన్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- వెబ్‌సైట్: https://www.icmr.nic.in

### గ్రూప్ ఏ, బీ పోస్టులు

**బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 160
- పోస్టులు: జాయింట్ డైరెక్టర్, స్టాఫ్ కార్ డ్రైవర్, డిస్పాచ్ రైడర్ తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 25
- వెబ్‌సైట్: https://bcasindia.gov.in

### రైల్ వికాస్‌లో..

**రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: ఎంజీఆర్/సివిల్, అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ ఎంజీఆర్
- విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, ఎస్ అండ్ టీ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 5
- వెబ్‌సైట్: http://www.rvnl.org

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- పాలిటీ, సోషల్ స్టడీస్, భౌతిక శాస్త్రం (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.